# తేనీరు

--- కాంతం, కాంతం, తలుపు !

లోపలినుంచి కాంతం వచ్చి తలుపుతీసి తేనీళ్ళు తయారయినవి-అన్నది.

--- తీసుకురా.

--- లోపలికి దయచేయవచ్చు.

కాంతానికి టీ విషయమై విసుగు. నేను ఉపాధ్యాయ వృత్తిలో ఉండి కొద్ది వేతనంతో ఎట్లో సంసారము గడుపుతున్నాను. ఏదో వస్తే అందులోనే సంసారము గడుస్తున్నది. అందులో హవ్యం కవ్యం అల్లా ఉంచగా ఎన్నో ఖర్చులు. ఇటువంటి సమయంలో సొమ్ములు చేయించలేదని కాంతానికి విసుగు.

ఈ స్థితిలో ఈ బాధపడలేక ఒకరోజు జమాఖర్చు ముందు వేసుకొని కూర్చున్నాను. ఏదైనా ఖర్చు తగ్గించటానికి వీలవుతుందేమో అని మా ఆశ.

పైనుంచి క్రిందికి పట్టీ చూచాను. కొన్ని అనవసరపు ఖర్చుగా కనిపించినవి. బియ్యం, ఉప్పు, పప్పు విషయంలో వివాదం లేదు. మిగతా వాటిలో కొంచెము ఘర్షణ జరిగింది. అవి రెండు సబ్బుబిళ్ళలు- ఇవి మానేద్దా. అని నేనన్నాను.

-- సబ్బుబిళ్ళలు మానవలసిందే. అయ్యే ఖర్చులు అవుతుంటే దీనికే వచ్చినది.

-- మరి ఏమి తగ్గించమంటావు ?

-- ఏమో, నాకేమి తెలుస్తుంది ?

-- అవును పాపం, నీకేమి తెలుస్తుంది ? ప్రతి నెలా రెవిక గుడ్డలు కొనటం మటుకు తెలుస్తుంది.

-- కోరిన సొమ్ములు లేవు సరిగదా, ఇంత కోరిన గుడ్డ అయినా కొనుక్కోవద్దు అంటారా ఏమిటి ?

-- మరి ఏమిటి చేయటం ?

-- ఏమిటి చేయటమా? టీ నీళ్ళు మానగూడదూ. కావలసినంత మిగులుతుంది. మూడుపూటలా ఆ నీళ్ళూ తాగుతాకయ్యే ఎక్కడి డబ్బూ అదే మింగుతుంది.

-- ఆ -- టీ యే మానటం అది తాగకపోతే ఏం తోచదు.

-- ఎందుకు తోచదూ, ఏదో పని కల్పించుకొంటే.

-- మనస్సు స్థిరంగా ఉండాలా పనిచేయటానికి.

-- పట్టుదల ఉంటేసరి - ఈ పని మానివేయాలి. ఈ పని చేయాలి అని. ఈ నీళ్ళేనా ఏమిటి మనిషికి పట్టు యిచ్చేది.

-- అందుకనే మానెయ్యలేకుండా వున్నాను.

-- ఏం విడ్డూరమండీ ! నేను మానిపించనా ?

నేను మానలేను, నీవు మానిపించనూ లేవు.

-- మానరూ ! మానిపిస్తే ?

-- పందెం !

- ఏమిస్తారు మీ చేత మానిపిస్తే ?

- ఏమి అడిగితే అదే.

- సరే, చూడండి నా తమాషా.

కాంతం బహుటక్కరు. ఏమి టక్కు పన్నుతుందో అని భయం వేసింది నాకు. కాంతం పట్టినపట్టు నెగ్గించుకొనే మనిషి. ఆవిడ టక్కులు మనమూహించలేము. ఇదివరలో నాకు అనుభవము కాబట్టి తగిన జాగ్రత్తలో ఉండటానికి ప్రయత్నపడ్డాను. ఆ రోజుననే మా వదినగారు కూడా వచ్చింది. వారిద్దరికి గుసగుసలు రహస్య ప్రసంగములు ఎక్కువయినయి. ఈ కొంటెపిల్ల నన్నేమి అవమానపరుస్తుందో గదా అని భయం వేసింది. వారిద్దరు కలిసి ఏదో ఒక పెద్ద కుట్ర పన్నుతున్నారని మాత్రం నాకు గట్టిగా నమ్మకం గలిగింది. నన్ను జూచి పలుమార్లు నవ్వటము నా నమ్మకాన్ని ధృఢపరిచింది.

ఆడవాళ్ళు ఎంతకైనా సాహసులే. లోకంలో అనేక యుద్ధాలకు స్త్రీకారణం. లోకంలో మాట ఎందుకు ? మా యింట్లో మా కాంతం మూలంగా ఎన్ని యుద్ధాలు జరిగినవి. ఎన్నిమార్లు సంధి కుదిరింది. ఆడదాని ప్రోత్సాహంవల్ల కాదూ ఆది పురుషుడు పాపం జేసింది.

ఆ రోజు నామీద ఏదో కుట్ర పన్నుతుందనుకొన్నాను. కుట్రపన్ని ఏం జేస్తుంది అనవచ్చును. ఆ కుట్రవల్ల తన పని నెరవేర్చుకోవటమేగాక నన్ను అవమానపరుస్తుంది.

నా జాతకఫలం అటువంటిది. గోపాలపురం నుంచి జాతకఫలం సంవత్సరానికి తెప్పించా. అందులో "యీ నెలలో నీకు గొప్ప అవమానం జరుగనున్నది" అని కూడా వ్రాసి వున్నది. ఇంతగా భయపడటానికి కారణం ఏమిటంటే ఇదివరలో అనేకమార్లు అవమానం భరించాను. జుట్టు మంచానికి కట్టి వెయ్యటం, తాంబూలంలో చింతగింజలు పెట్టటం, లేకపోతే సగం కొరికిన వక్కలు ఉంచటం, జ్ఞాపకం వచ్చినవి.

అందుకని తగిన జాగ్రత్తపడ్డాను. నిద్ర లేవడంతోనే చప్పున లేవక ముందు జుట్టు స్వేచ్ఛగా ఉందీ లేనిదీ విచారించి ఝాడించి ముడివేసుకొని క్రింద ఏమీ లేకుండా చూచుకొని దిగాను ఇప్పటికి ఒక గండం గడిచింది.

కాని దానితో ఏమయినది ఇల్లు అలకంగానే పండుగ కాలేదు. ఎన్నో గంటలు జరగాలె. క్షణంలో నన్ను అవమానపరచే శక్తిగలది కాంతం. ఆరోజు అంతా జాగ్రత్తగా ఉన్నాను. భోజన సమయములో కూరల విషయమై పరీక్షించి మరీ తిన్నాను. పులుసులో ముక్కల విషయమై ప్రత్యేకంగా జాగ్రత్తపడ్డాను. మధ్యాహ్నం నిద్రపోవటం మాని ఏదో పుస్తకం ముందు వేసుకొని దీక్షగా చదువుచున్నట్లు నటిస్తూ అక్క చెల్లెండ్ర ప్రసంగాలు వినేటందుకు ప్రయత్నించాను. వాళ్లు అవతల గదిలో వుండటంవల్ల నాకు సరిగా వినిపించలేదు కాని కొన్ని ముక్కలు అప్పుడప్పుడు వినిపించినవి.

-- నిజంగా

-- మరేమిటి

-- దాని తరువాత నన్ను నిన్ను గూడ తిడితే

-- తర్వాత వాళ్ళిద్దరూ గుసగుసలాడారు. నవ్వుతూ మా వదినగారు.

-- పాపం భరించలేదేమో అన్నది.

-- నే జేస్తానుగా అని కాంతం ధైర్యమొలికే కంఠముతో పలికింది.

దీని తరువాత మరేమో రహస్య ప్రసంగములు జరిగినవి. అవన్నీ ఒక పెద్ద నవ్వుతో ముగిసినవి నాకు ఆదుర్దా ఎక్కువయింది. కాంతం వైఖరి జూస్తే నాకేమాత్రం మనశ్శాంతి లేదు. వారి సంభాషణవల్ల ఏదో భరింపరానిది నా మీద వేస్తారని బోధపడ్డది. దానికితోడు కాంతం ముసిముసి నవ్వులు నా అనుమానాన్ని మరీ బలపరిచినవి. ఆ నవ్వులెందుకు ! ఆ సంతోషమో ! ఆ రహస్యప్రసంగాలెందుకో నాకు బోధపడలేదు. కాంతంలో రెండు భావాలు కనబడుతున్నవి. ఒకటి కొంచెం భయం. రెండోది ఒక విధమైన సంతోషము. ఇట్టి మిళిత భావ ప్రకటన కుట్రకోసం అని ఎవరు గ్రహించలేరు. ఆ కుట్రవల్ల నాకవమానం కలుగుతుంది. నేను తిడతానేమో అని భయం. తాను తప్పక గెలుస్తానని సంతోషం. అయితే అంత భరింపరాని అవమానమా? ఏమిటి చెపుమా ? అని ఆలోచించాను. ఏమి బోధపడలేదు. ఆఁ.. నేను భరింపలేని కార్యాన్ని చేయటానికి కాంతం పూనుకొన్నది. వదినెగారు జంకుతున్నది. ఆ.

2

ఇల్లా ఆలోచిస్తూ కుర్చీలో కూర్చున్నాను. ఆలోచనలో నుండగా నిద్రపట్టింది. ఇంతలో కాంతం వచ్చింది. కుర్చీ వెనుకగా వచ్చి నా కళ్ళు మూసింది. నేను ఉలిక్కిపడి లేచి చేతులు విదిలించుకొన్నాను కాంతం నా ఎదుటికి వచ్చి నిలుచున్నది.

– ఏమిటి కొత్త ఎత్తు ఎత్తుతున్నావు. మీ అక్కయ్య నీవు కలసి నా మీద ఏదో కుట్ర పన్నుతున్నారు ఏమిటీ చెబుదూ ?

-- మీ వన్నీ టక్కరు మాటలు – ఊరుకొందురూ – ఈ మాట కేమిగాని నాకు మురుగులు చేయించరూ.

– చేయిస్తానులే.

మీరు ఎప్పుడూ అల్లాగే అంటారు. నేను బతికి ఉండగా......

-- అల్లా అంటేనే నాకు కోపం వస్తుంది.

-- మరి నాకు మురుగులు చేయించండి.

– ఎప్పుడు ?

– ఈ రోజే.

– సరి. బాగానే ఉంది పట్టు.

– చూడండి కొనిపించకపోతే.

– నేను చేయించనంటే కొట్టి చేయిస్తావా అన్నాను.

కొట్టటం అంటే జ్ఞాపకం వచ్చింది. మా యిద్దరికీ మతీ చిన్నతనంలో వివాహం అయింది. వివాహంలో ఒకరోజున గంధం పూయించారు. నాకు గంధం పూయటానికి పెండ్లికూతురు వచ్చింది. మొదట వద్దు అన్నాను. మా వాళ్ళంతా పూయించుకోమంటే సరే అని మెడ ఎత్తాను. మెడ క్రింద పూస్తున్నట్లే పూసి చెంపమీద లెంపకాయ కొట్టింది. అందుకని కొడతావా ఏమిటీ అని ఎప్పుడూ ఎత్తిపొడుస్తుంటాను.

కాంతం సొమ్ము విషయమై గట్టి పట్టు పట్టింది. టీ మానిపిస్తానని పంతం గట్టింది. రెండు పనులు ఒకేమారే నెరవేర్చగలదు. ఎట్లాగయితేనేమి ఆ పగలు గడిచింది. రాత్రి స్నానానికి లెమ్మన్నారు. రాత్రి గడిస్తే బ్రతికినట్లే. ప్రతి విషయంలోను జాగ్రత్తపడ్డాను. భోజనానంతరము తమలపాకులు వేసుకొనివచ్చింది కాంతం ఆ యీనెలతబుకులోనే పెట్టుకొని వచ్చింది. ఈనెల తబుకు జూచినప్పుడు మా ప్రథమ పరిచయం స్ఫురించింది. మరొక్కమారు ప్రేమవాహిని ప్రవహించింది. "కాంతం" అని దగ్గరకు లాగుకొన్నాను. కాంతం చిరునవ్వు నవ్వి విదలించుకొని వెళ్ళిపోయింది. అల్లరి జంతువని నాలో నేననుకొని ఒక విసిగింపు నవ్వు నవ్వుకొన్నాను.

రాత్రి పడుకొన్నాను కాని నేను భరింపరాని దేమిటా అనే శంక బాధిస్తూనే వుంది. అట్టే నిద్రపట్టలేదు, తెల్లవారుఝామున మెళకువ వచ్చింది కాంతం ఓడిపోయింది. నన్ను ఏమి అవమానం చెయ్యలేదని ధైర్యం వచ్చింది. అప్పుడు బాగా నిద్రపట్టింది. నేను మళ్ళీ మేలుకొనేటప్పటికే సుమారు ఎనిమిది గంటలవుతుంది.

"బతికానురా" బాబూ అనుకొని ఒళ్ళు తెలియని సంతోషంతో మంచము చప్పున దిగాను. కాలు క్రింద పెట్టానో లేదో భగ్గుమన్నది. భగభగమనే మంటలో కాలు పెట్టినట్లు తోచింది. కాంతం అని కేకవేశాను, కాంతం వచ్చి.

– అబ్బా ! చూచి దిగవద్దూ – ఆ పాడు టీ కప్పు అక్కడ మర్చిపోయినాను – చూడక ఆ వేడి తేనీరు కాలిమీద పోసుకున్నారు ఆ పాడు తేనీళ్ళు తాగవద్దంటే వినరుగా. ఒక సంవత్సరం టీ మానివెయ్యండి. ఇటువంటి చక్కని మురుగులు వస్తవి. (అని తన ముద్దు చెయ్యి ఎత్తి నాకు చూపింది).

– ఎక్కడివి అన్నాను.

నిన్న మా అక్కయ్య తెచ్చింది. సుబ్బమ్మకు కావాలని చేయించుకొని తీసుకునిపోతుంటే నేను తీసికొన్నాను. ధర మీరు ఒక్కమారు భరించలేరని అప్పుడప్పుడు యిచ్చేట్టు ఏర్పాటు చేశాను.

"అవును దారులు కొట్టే రకం మీది" అన్నాను. కాంతానికి ఆ బంగారపు మురుగులు ఎంతో అందముగా ఉన్నవి. నీ చిట్టి చేతులకూ – బంగారుగాజు లందమే" -- అనే పదం జ్ఞాపకం వచ్చింది, మురుగులు పెట్టుకొన్న ఆ చక్కని చేతికొరకై, ఒక్క సంవత్సరం టీ మానితే నేమి అనుకొన్నాను. హేమకంకణముతో ముద్దులు మూటగట్టుతున్న ఆ శిరీష కోమల హస్తాన్ని పైకెత్తి ముద్దుబెట్టుకోబోయాను. ఆ కొత్త మురుగులు రాచుకొని కాబోలు నా చెంప చిటుక్కుమన్నది. నేను నవ్వుతూ పులకించిన ఆ స్వప్న హస్తాన్ని వదలినాను. కరకంకణములు ఘల్లుఘల్లుమన ఆమె కిలకిలా నవ్వుతూ పరుగెత్తినది. నా కళ్ళు అప్రయత్నంగా మూతలు పడ్డవి. నేను కళ్ళు తెరచి చూచేసరికి నా మంచం క్రింద టీ కప్పు పగిలి ముక్కలై ఉన్నది.

(1962)